

భూ సమస్యల పరిష్కారానికి కసరత్తు



ధరణి పోర్టల్ పేరును రేవంత్ సర్కారు భూదేవి లేదా భూమాతగా మార్చాలని భావిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న భూ రికార్డుల నిర్వహణ పద్ధతులను పరిశీలించిన అనంతరం వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి వేర్వేరు రికార్డులు చేయాలనే నిశ్చయానికి ప్రభుత్వం వచ్చింది. భూ రికార్డుల నిర్వహణకు మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోవడం ద్వారా తదుపరి కార్యాచరణ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. భూ సేకరణలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరించేలా మార్పులు తేవడంతోపాటు పట్టాదారు మృతి చెందిన పక్షంలో వారసత్వ భూముల బదలాయింపు ప్రక్రియ వేగవంతం చేయనున్నారు. గ్రామాల్లో ఆబాదీ భూముల రికార్డులను ఆధునీకరించడం, సాదా బైనామా, భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు, ఈసీలో అనుభవదారుడి పేరిట కాలమ్ ప్రవేశపెట్టడం లాంటి మార్పులు చోటు చేసుకోనున్నాయి. అప్పీల్ అథారిటీ ఆర్డీవోలకు అప్పగిం చేలా చర్యలు తీసుకోనున్నారు. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో అప్పిలేట్ అథారిటీ ఉండే విధంగా రూపకల్పన చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులకు నష్టం వాటిల్లకుండా చట్టాన్ని రూపొందించనున్నారు. నూతన ముసాయిదా చట్టం విధివిధానాలను ఇప్పటికే సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచగా, అవసర మైన మార్పులు, చేర్పుల కోసం 20 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు.

భూ రికార్డుల నిర్వహణ

- నూతన ఆర్వోఆర్ చట్టం రూపకల్పన
- సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో ముసాయిదా చట్టం
- మూడేళ్ల నుంచి పేరుకుపోయిన సమస్యలు
- వేర్వేరు భూములకు ప్రత్యేక రికార్డులు
- 20 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ

మంచిర్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నూతన ఆర్వోఆర్ చట్టం ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సృష్టించిన సమస్యలు అన్నీ ఇన్నీకావు. రైతుల ప్రమేయం లేకుండా రెవెన్యూ రికార్డుల్లో తప్పులు దొర్లడంతో సమస్య జఠిలమైంది. రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పులకు లక్షలాది మంది రైతులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తాతల కాలం నుంచి పట్టాగా ఉన్న భూములను ప్రభుత్వ నివంటూ ఎలాంటి నోటీసులు లేకుండానే నిషేధిత జాబితాలో చేర్చడంతో అష్టకష్టాలు పెడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

ప్రతి పనికీ కోర్టుకే...

ధరణి పోర్టల్‌లో తప్పొప్పుల సవరణకు ఇంతకాలం చట్టబద్ధత లేకుండాపోయింది. సంబంధిత అధికారులకు అధికారాలను కట్టబెట్టకపోవడంతో సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. పేరు తప్పుబడినా, సర్వే నంబర్ మిస్ అయినా సిబ్బంది తప్పులకు కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోర్టుకు వెళ్లి ఆర్డర్ కాపీ తెచ్చుకోండని అధికారులు చెబుతున్నారు. ధరణి పోర్టల్, ఆర్వోఆర్ 2020 నిబంధనలు సామాన్యులకు చుక్కలు చూపించాయి. చట్టాన్ని మార్చి రైతాంగానికి చిక్కులు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొస్తున్నది. ఈ చట్టంపై ముందుగా రైతులకు అవగాహన కల్పించా లనే లక్ష్యంతో ముందుకెళ్తున్నది. అందుకు నూతన చట్టం లో పొందుపరిచిన 20 సెక్షన్లకు గాను 20 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రజాభిప్రాయ సేకరణలో తీసుకున్న అంశాలను సీసీఎల్ఏకు పంపిన అనంతరం చట్టం ముసాయిదాపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ధరణి పోర్టల్, ఆర్వోఆర్ చట్టంలోని లోసుగులను సవరించి రైతులకు మేలు చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ఆర్వోఆర్‌లో తేడాలు..

అంశం	2020	2024
సవరణలు	అవకాశం లేదు	అవకాశం ఉంది
రిజిస్ట్రేషన్	తహసీల్దార్	తహసీల్దార్, డీటీ
మ్యూటేషన్	సెక్షన్ 5,6,7	సెక్షన్ 5,7,8 విచారణతో
సబ్‌డివిజన్	లేదు	అవకాశం కల్పించారు
డాక్యుమెంట్	పాస్‌బుక్	పాస్‌బుక్
అప్పీల్	లేదు	సెక్షన్ 14,15లతో ఏర్పాటు

గట్టు మల్లన్నను దర్శించుకున్న డీసీపీ



పూజలు చేస్తున్న డీసీపీ భాస్కర్

జైపూర్, ఆగస్టు 26: వేలాల గ్రామంలోని గట్టు మల్లన్న స్వామిని సోమవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు డీసీపీకి స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డీసీపీ మాట్లాడుతూ గట్టు మల్లన్న స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ మోహన్, ఎస్ఐ శ్రీధర్ ఉన్నారు.

గూడెంలో ముగిసిన పవిత్రోత్సవాలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

దండేపల్లి, ఆగస్టు 26: గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పవిత్రోత్సవ పూజలు సోమవారం ముగిసాయి. మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను అర్చకులు గోవర్ధన రఘుస్వామి, సంపత్ స్వామి, సురేష్‌స్వామి, యాగ్నికులు అభిరామాచార్యులు, వేదపండితులు దుద్దిళ్ల నారాయణశర్మ నిర్వహించారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. పలువురు భక్తులు కుటుంబ సమేతంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు.

మహిళకు డెంగ్యూ పాజిటివ్



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నస్పూర్, ఆగస్టు 26 : నస్పూర్ మున్సిపాలిటీలోని ఒకటవ వార్డు జయశంకర్ కాలనీకి చెందిన మహిళ (32)కు డెంగ్యూ నిర్ధారణ అయ్యింది. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 24న మంచిర్యాలలో పరీక్ష చేయించుకోగా డెంగ్యూగా తేలింది. ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నస్పూర్‌లో ఆరు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయిన ఇంటిని సోమవారం కీటక జనిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సందర్శించారు. దోమల నివారణకు ఇంటి, పరిసర ప్రాంతాల్లో ద్రావణాన్ని స్ప్రే చేశారు. కుటుంబ సభ్యులకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. టెక్నీషన్ శ్రీనాథ్, ఏఎన్ఎం రాధ, ఆశ వర్కర్ వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

మహ్మదాబాద్ వాసికి యోగారత్న అవార్డు

జన్నారం, ఆగస్టు 26: మహ్మదాబాద్ గ్రామానికి చెందిన యోగా గురువు దుర్గం వినోద్‌కుమార్ యోగా రత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం హైద్రాబాద్‌లోని జ్యోతి క్లబ్‌లో జరిగిన పోటీల్లో యోగా గురువు వినోద్‌కుమార్‌కు అవార్డును తెలంగాణ యోగా అసోసియేషన్ కార్యదర్శి జె. మనోహర్ అందజేశారు. ఎస్‌జీటీ సంస్థ చైర్మన్ నాయిని ప్రసాద్ నేత, మండల ప్రజాప్రతినిధులు వినోద్‌కుమార్‌ను అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

వేమనపల్లి, ఆగస్టు 26: నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సోమవారం తనిఖీ చేశారు. ఆయన స్టేషన్‌లోని రికార్డులు, ఫైళ్లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఐ శ్యామ్ పటేల్, సిబ్బంది ఉన్నారు.

సిమెంటు బెంచీ ఏర్పాటు

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 26: తాండూర్ బస్టాప్ సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గోలి మహేందర్ జ్ఞాపకార్థం జెడ్పీహెచ్ఎస్ 1999-2000 బ్యాచ్ మిత్రులు సిమెంటు బెంచీని ఏర్పాటు చేశారు. సిద్ధిక్, మల్లేష్, శోభన్, రవి, సంతోష్ పాల్గొన్నారు.

కొల్లూరులో కొనసాగుతున్న వైద్య శిబిరం



రోగులకు చికిత్సలు చేస్తున్న వైద్య సిబ్బంది

కోటపల్లి, ఆగస్టు 26: మండంలోని కొల్లూరులో జ్వరాల తీవ్రత ఉండడంతో సోమవారం రెండో రోజు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు అరుణశ్రీ రోగులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. శిబిరంలో 220 మందికి ఓపీ, 32 మందికి రక్త పరీక్షలు జరిపారు. సోమవారం కమ్యూనిటీ హెల్త్ అధికారులు నాందేవ్, సత్యనారాయణ, సంగయ్యలతో కూడిన వైద్య బృందం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి జ్వరాల తీవ్రతపై వివరాలు సేకరించారు. వైరల్ జ్వరాలు ప్రబలుతున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆందోళనకు గురికావద్దని పేర్కొన్నారు. మురుగునీటి గుంతల వద్ద కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో క్లోరినేషన్, దోమల నివారణ మందు పిచికారి చేశారు. ఇండ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వేడి చేసిన నీటిని తాగాలని, పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు అంజలి, ఇందిర, విజయని ర్మల, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, మోడల్ స్కూల్ వసతి గృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో సంగయ్య, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, ఆశా కార్యకర్త మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి

హాజీపూర్, ఆగస్టు 26: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ చేస్తున్న కృషి అభినందనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లిలోని ప్రైవేటు ఫంక్షన్‌హాలులో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. దాదాపు 22 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహించాలని కోరారు. అనంతరం పీఆర్‌టీయూటీఎస్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి యోగా పోటీలు



విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

ఏసీసీ, ఆగస్టు 26: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలు ఆదివారం ముగిసాయి. ట్రెడి షనల్ ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో అండర్ 14, 17, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 200లకు పైగా పిల్లలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని సెప్టెంబరులో హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ రఘునాథ్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ బిల్ల మల్లయ్య, అధ్యక్షుడు తిరుపతివర్మలు అందజేశారు. మండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు

బెల్లంపల్లి, ఆగస్టు 26: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలోని పలు వార్డులోని నివాస గృహాలకు విద్యుత్‌లో హెచ్చు తగ్గులు వస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. విద్యుత్ హెచ్చు తగ్గుల వల్ల ఇంట్లోని విద్యుత్ గృహోపకరణాలు కాలిపోతున్నాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ హెచ్చుతగ్గులతో సీలింగ్ బల్బులు, ఫ్యాన్‌లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు చెడిపోయి ఆర్థికంగా నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 26: నిత్యావసర ధరలు, రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షలు చేయాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అలాగే నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సెప్టెంబరు 2న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతామన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కార్యవర్గసభ్యులు మేకల దాసు, జోగుల మల్లయ్య, మహేందర్‌రెడ్డి, దేవి పోచన్న, లక్ష్మణ్, అఫ్రోజ్‌ఖాన్, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ



బానయ్యకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 26 : తాండూర్ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సాలిగాం బానయ్య సోమవారం ఎమ్మెల్యే వినోద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బానయ్యకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రంథాలయం మాజీ చైర్మన్ మహేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్, నాయకులు గట్టు మురళీధర్‌రావు, పేరం శ్రీనివాస్, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద నిలయంలో మదర్ థెరిస్సా జయంతి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 26: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆనంద నిలయం (అనాథల, వృద్ధుల ఆశ్రమం)లో సోమవారం మంచిర్యాల లయన్స్‌క్లబ్ వారు మదర్ థెరిస్సా జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం వృద్ధులకు, పిల్లలకు బ్రెడ్, పండ్లను అందజేశారు. చంద్రమౌళి, వి.మధుసూదన్ రెడ్డి, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 26: పట్టణంలోని ఎల్ఐసీ కాలనీ, పద్మశాలి కాలనీలలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నాం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ఏడీఈ వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వం బేషరతుగా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల్ శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 26 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. సోమవా రం మంచిర్యాలలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు వర్క్ షాపులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయకుండా లేని పోని అం క్షలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఎన్నికల సమ యంలో ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జాతీయ స్థాయిలో ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త ఇంటిం టికి వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ పార్టీ సభ్యత్వం పొం దడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయ కులు మల్లారెడ్డి, ఏమాజీ, మున్నారాజాసిసోడియా, కృష్ణమూర్తి, రజనీష్‌జైన్, అశోక్, శ్రీదేవి, నర్సింహులు, మల్లేష్‌రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

నస్పూర్, ఆగస్టు 26: కాలనీల్లో నెలకొన్నసమస్యలను సత్వరమే పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. మున్సిపాలిటీలోని 12వవార్డుల్లో సోమవారం రాత్రి స్థానిక నాయకులతో సమావేశమైయ్యారు. ఈసందర్బంగా అక్కడకు వచ్చిన పలువురు ప్రజలు సమస్యలను విన్నవించారు. ఇందిరమ్మ కాలనీ, రైతుకాలనీ ఆర్అండ్ఆర్‌కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ లైట్లు సక్రమంగా లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు సమస్యలను పరిష్కరం చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ వేణు, 12వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు

ఉరి వేసుకొని రిటైర్డు కార్మికుడి ఆత్మహత్య



చిన్నయ్య (ఫైల్)

మందమర్రి టౌన్, ఆగస్టు 26: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు సొన్నాయిల చిన్నయ్య (70) ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులతో గొడవ పడిన చిన్నయ్య గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 ద్వారా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మద్యానికి బానిసై చిన్నయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 26: తాండూర్ మండలం బోయపల్లికి చెందిన ఇప్ప రవి (40) మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవి మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నెల 25న మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

పోగొట్టుకున్న నగదు, బంగారం అందజేత

చెన్నూరు, ఆగస్టు 26: డబ్బులు, బంగారం పోగొట్టుకున్న మహిళకు పోలీసులు మూడు రోజుల్లో రికవరీ చేసి అందజేశారు. మూడు రోజుల క్రితం రావిచెట్టు సమీపంలోని కోటపల్లి బస్టాండ్ వద్ద ఇద్దరు మహిళలు ఆటోదిగి డ్రైవర్‌కు డబ్బులు ఇచ్చే క్రమంలో వారి వద్ద ఉన్న పర్సు కింద పడింది. పర్సులో రూ.24 వేల నగదు, బంగారు ఆభరణాలు ఉన్నాయి. పర్సు పోయిందని గుర్తించిన మహిళలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఆటో డ్రైవర్ తీసుకున్నాట్లు గుర్తించారు. అతడి నుంచి రికవరీ చేసి అప్పగించారు. హోంగార్డు ఖదీర్‌ను పట్టణ సీఐ అభినందించి పారితోషికం అందించారు.

కౌన్సిలర్‌పై కేసు నమోదు

నస్పూర్, ఆగస్టు 26: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేస్‌బుక్, ఇతర మాధ్యమాల్లో బీఆర్ఎస్ నాయకుడు, కౌన్సిలర్, బేర సత్యనారాయణ తప్పుడు ప్రచారం చేశాడని సోమవారం మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ళ వేణు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బేర సత్యనారాయణపై తప్పుడు ప్రచారం, అసత్య ఆరోపణలు చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

ప్రైవేటు వైద్యుడిపై ఫిర్యాదు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 26 : తన తండ్రి దాసరి లచ్చన్న మృతికి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యుడే కారణమంటూ అతని కుమారుడు తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గత నెల 30న లచ్చన్నను సదరు ఆసుపత్రిలో కాలు శస్త్ర చికిత్స నిమిత్తం చేర్పించామని, వైద్యుడు సరైన చికిత్స అందించకుండా నిర్లక్ష్యం వహించడంతోనే మృతి చెందాడని తిరుపతి ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని సీఐ వెల్లడించారు.

రెండు లారీలు ఢీ

కాసిపేట, ఆగస్టు 26: మండలంలోని కోమటిచేను సమీపంలో సోమవారం సాయంత్రం ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో ముందున్న లారీ అదుపు తప్పి రోడ్డు కిందకు దిగింది. లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డుకు అడ్డంగా లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రిటౌన్, ఆగస్టు 26: పట్టణంలోని ప్రాణహిత కాలనీలో నివాసం ఉంటున్న కాసిపేట గనికి చెందిన ఎస్టీ కార్మికుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ శివ, మందమర్రి ఏరియా జనరల్ సెక్రెటరీ రవికుమార్, అడిషనల్ సెక్రెటరీ నాగేశ్వర్‌నాయక్‌లు మాట్లాడుతూ కాలనీలో క్వార్టర్లను ఆక్రమించుకుని ఉంటున్న కార్మికేతరులు కార్మికుడిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికేతరులను ఖాళీ చేయించాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేందర్‌నాయక్, బానోత్ రవి తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో గోపికలు, కృష్ణుల వేషధారణలో విద్యార్థులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

చెన్నూరు, ఆగస్టు 26: చెన్నూరు పట్టణం, మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయం, జగన్నాథస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగ్రాజ్‌పల్లి వివేకానంద విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులు, గోపికలు, కృష్ణుని వేషధారణలో అలరించారు. కరస్పాండెంట్ మనికందన్, హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విలేజ్ నస్పూర్, ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలతో ఆటాపాటలతో అలరించారు. యువకులు ఉట్టికొట్టారు.

మంచిర్యాల అర్బన్: హైటెక్‌సిటీలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహంలో వనితా వాక్కు ఫౌండేషన్ సభ్యులు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఫౌండేషన్ కోఫౌండర్స్ కవిత, సునీత మాట్లాడుతూ కృష్ణుడు అందించిన భగవద్గీతను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు.

హాజీపూర్: రాంపూర్ శిశుమందిర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామన్న ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఉట్టి కొట్టి మిఠాయిలు పంచి పెట్టారు.

కాసిపేట: హనుమాన్ ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో అలరించారు.

దండేపల్లి: దండేపల్లి రామాలయం వద్ద నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు సందడి చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చిన్నారులచే నిర్వహించారు.

శ్రీరాంపూర్: కృష్ణకాలనీ, ఆర్కే-8 కాలనీ, నస్పూర్ కాలనీలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష పుష్పార్చన, విష్ణు సహస్ర పారాయణం, నైవేద్యం, ఊయల సేవ, తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణ జరిగింది. అనంతరం భక్తులు కోలాటం ఆడారు. భక్త రాజేశం, ప్రసాద్, సారయ్య, రాంబాబు, రాజన్న, మధుకర్, రాంచందర్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో కృష్ణాష్టమి వేడుకలు

జన్నారం: మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు.

భీమారం: మండల కేంద్రంలోని యాదవ కమ్యూనిటీ హాలులో కృష్ణాష్టమి నిర్వహించారు. కృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచి పెట్టారు. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. రాజేందర్, రాజన్న, మల్లేష్‌కు మార్, శ్రీనివాస్, మల్లేష్, మహేష్, పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: చిర్రకుంట హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భజన కార్య క్రమాలు నిర్వహించారు. గందె రాంచందర్, ఒడ్నాల కొము రయ్య పాల్గొన్నారు. పొన్నారంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈద లింగయ్య, వాల రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: పలు గ్రామాల్లోని భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వీరాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం, కృష్ణాష్టమి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

జన్నారంలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న బంజారా మహిళలు

జన్నారం, ఆగస్టు 26: మండలంలో లంబాడి కులస్తులు తీజ్ ఉత్సవా లను సోమవారం ఘనంగా నిర్వహించారు. బంజారా సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో జువ్విగూడలో సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ దేవి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. యువతులు వెదురు బుట్టల్లో ఉంచిన గోధుమ, వరి మొలకలతో నృత్యాలు చేస్తూ ర్యాలీగా ధర్మారం చౌరస్తా వరకు చేరుకున్నారు. జాదవ్ సందేశ్, ప్రకాష్‌నాయక్, బీమ్‌లాల్‌నాయక్, నాయక్, రాములునాయక్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

నేడు ఏజెన్సీ బంద్ విజయవంతం చేయాలి

కాసిపేట, ఆగస్టు 26 : ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని మంగళవారం ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమన్న అన్నారు. సోమవారం దేవాపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి, జనరల్ డీఎస్సీలో ఏజెన్సీ కోటాప్రకటించి జీవో నెంబరు 3ని పునఃపరిశీలించాలని కోరారు. ఐటీడీఏ పరిధిలో ఎలాంటి నోటిఫికేషన్‌లు లేకపోవడంతో చదువుకున్న ఆదివాసీ గిరిజనులు నష్టపోతున్నారన్నారు. ఏజెన్సీ బంద్‌లో గిరిజనులు, ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కుర్సెంగ తిరుపతి, రాయిసిడం శంకర్, నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లి: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రాయి సెంటర్ మండల అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగులు డిమాండ్ చేశారు. సోమవారం దండేపల్లిలో సమావేశం నిర్వహించి మంగళవారం ఏజెన్సీ ప్రాంతాల బంద్‌కు పిలుపునిచ్చారు. సోము, అర్జున్, కిషన్, కాంతరావు, జలపతి, లచ్చుపటేల్. ఎల్లయ్య, హన్మంతు పాల్గొన్నారు.

వీవోఏలకు రూ. 26 వేల వేతనం చెల్లించాలి

కన్నెపల్లి, ఆగస్టు 26 : ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని వీవోఏల సంఘం గౌరవాధ్యక్షుడు జుమ్మిడి లక్ష్మణ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా వర్తింపజేయాలని, వేతనం నేరుగా ఖాతాల్లో జమ చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు దాసు, ఎల్లయ్య, ధర్మయ్య, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్

జైపూర్, ఆగస్టు 26: యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తర తెలంగాణ రీజినల్ డైరెక్టర్ కుతాడి తిరుపతి పేర్కొన్నారు. జయహో టీం ఆధ్వర్యంలో సెప్టెంబరు 3,4 తేదీల్లో కరీంనగర్‌లో జరగనున్న మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతకు కుటుంబంలో, కళాశాలల్లో సరైన సలహాలు ఇచ్చే వారు లేకపోవడంతో తప్పుదారి పడుతుందన్నారు. ఇంపాక్ట్ ప్రోగ్రాంలో ప్రతీ ఒక్కరు పాల్గొని కొత్త విషయాలను నేర్చుకుని భవిష్యత్‌లో అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 9676004408 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. జనార్దన్‌రెడ్డి, భాగ్యలక్ష్మీ, దుస్స భాస్కర్, సురేందర్, రాజిరెడ్డి, నాగిరెడ్డి, హన్మంతు, వివేక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదశాత్తు ఇల్లు దగ్ధం

రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం



పూర్తిగా కాలిపోయిన ఇల్లు

చెన్నూరు, ఆగస్టు 26: మండలంలోని ఆస్నాద గ్రామంలో ఇంగిలి బాలయ్య అతని కుమారులు లింగయ్య, శ్రీనివాస్‌లకు చెందిన ఇల్లు గ్యాస్ లీకై పూర్తిగా కాలిపోయింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం పొలం పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని అన్ని వస్తువులు కాలిపోయాయి. లింగయ్య కుమార్తె వివాహం కోసం ఇంట్లో ఉంచిన రూ.3 లక్షలు, 8 తులాల బంగారం, దుస్తులు, ఇతర వస్తువులు కాలిపోయాయి. శ్రీనివాస్ నూతన ఇంటి నిర్మాణానికి ఇంట్లో ఉన్న రూ.2 లక్షలతోపాటు 4 తులాల బంగారం వస్తువులు కాలిపోయాయి. అలాగే బాలయ్యకు చెందిన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

గంజాయి మత్తు యువత చిత్తు



- మహారాష్ట్ర, ఒడిశా నుంచి రవాణా
- నియంత్రణ చర్యలు చేపట్టిన పోలీస్‌లు
- పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు
- ఇప్పటి వరకు 55 కేసుల నమోదు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 26: జిల్లాలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా యువత మత్తుకు బానిసవుతున్నారు. మద్యం, పొగాకు, గుట్కా, పాన్ మసాలా లాంటి వాటికి అలవాటు పడిన పలువురు అధిక మత్తు కోసం గంజాయిని వాడుతున్నారు. గంజాయి వ్యసనపరుల్లో అధిక శాతం 30 యేండ్ల లోపు యువకులు, విద్యార్థులు ఉండటం ఆందోళనను కలిగిస్తోంది. యువత సరదాగా మద్యం సేవించడాన్ని మొదలు పెట్టి సిగరేట్‌కు, గంజాయికి అలవాటు పడుతున్నారు. మత్తుకు బానిసలై వ్యసనపరులుగా మారుతున్నారు. జల్సాలకు డబ్బులు సరిపోక గంజాయిని రవాణా చేస్తే పెద్ద మొత్తంలో డబ్బులు రావడంతోపాటు వారు ఉపయో గిస్తుండడంతో రవాణా చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. గంజాయి బారిన పడిన యువత విచక్షణ కోల్పోయి కుటుంబసభ్యులతో గొడవలకు దిగడంతో పాటు దొంగతనాలకు, నేరాలకు పాల్పడుతున్నారు.

మహారాష్ట్ర, ఒడిశా నుంచి రవాణా

మంచిర్యాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు మహారాష్ట్ర, ఒడిశా నుంచి గంజాయి రవాణా అవుతోంది. రైలు మార్గం ద్వారా రవాణాదారులు తరలిస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా రవాణా చేస్తున్నారు. కొందరు ముఠాగా ఏర్పడి కేజీల చొప్పున గంజాయిని కొనుగోలు చేసి 20 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నియంత్రణ చర్యలు చేపట్టిన పోలీస్ శాఖ

గంజాయిని నియంత్రించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రామగుండం సీపీ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు కమిషనరేట్ వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపడుతుండటంతోపాటు గంజాయి సేవిస్తున్న, రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. గంజాయికి బానిసైన వారిని డీఅడిక్షన్ సెంటర్లలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు యువత, విద్యార్థులు గంజాయి బారిన పడకుండా ఉండేందుకు గ్రామాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. గంజాయి వాడకం వల్ల కల్గే నష్టాలను వివరించడంతో పాటు వినియోగించినా, రవాణా చేసినా, విక్రయించినా చట్టపరంగా తీసుకునే చర్యల గురించి వివరిస్తున్నారు.

యేటా పెరుగుతున్న కేసులు...

గంజాయి నియంత్రించేదుకు పోలీస్‌శాఖ చర్యలు చేపడుతున్నప్పటికి దాని వినియోగం, రవాణా యేటా పెరుగుతూనే ఉంది. 2022లో 22 కేసులు నమోదు కాగా 16.597 కేజీల గంజాయి సీజ్ చేయడంతోపాటు 70 మంది అదుపులోకి తీసుకున్నారు. 2023లో 80 కేసు లు నమోదు కాగా 519.464 కేజీల గంజాయి సీజ్ చేసి 141 మంది అరెస్టు చేశారు. ఈ యేడాది ఇప్పటి వరకు 55 కేసుల నమోదు కాగా 36.949 కేజీల గంజా యిని సీజ్ చేసి 140 మందిని అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి రూపుమాపేందుకు చర్యలు : రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్



కమిషనరేట్ వ్యాప్తంగా గంజాయి మహమ్మారిని శాశ్వతంగా రూపుమాపేం దుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. గంజాయి వినియోగిస్తున్న, రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. పలుమార్లు పట్టుబడిన వారిపై క్రిమినల్ షీట్‌ను ఓపెన్ చేస్తున్నాం. గ్రామాల్లో, పాఠశా లలు, కళాశాలల్లో అవగాహన కార్యక్ర మాలను ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సరిహద్దు రాష్ట్రాల పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సరిహద్దుల్లో తనిఖీలను ముమ్మరం చేస్తాం. అందరి సమన్వయంతో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేస్తాం.



యాదవుల అభివృద్ధికి కృషిచేస్తా

- యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు



జెండా ఆవిష్కరిస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

బెజ్జూరు, ఆగస్టు 26: యాదవసంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని యాదవసంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఎగురవేసి మాట్లాడారు. బెజ్జూరు యాదవసంఘ భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బెజ్జూరులో బస్టాండు నిర్మాణానికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం రంగనాయక ఆలయ కమిటీ మహేష్ ఆధ్వర్యంలో నాగేశ్వర్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ, యాదవసంఘం నాయకులు సత్యనారాయణ, శంకర్, ఎర్రయ్య, శ్రీశైలం, శ్రీనివాస్‌సురేష్, శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని సోమిని గిరిజనఆశ్రమ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

గణపతి ఆలయంలో ఎక్కాహం

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 26: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణపతి ఆలయంలో సోమవారం భక్తులు 24గంటల పాటు ఎక్కాహం నిర్వహించారు. కార్యక్రమం నేడు ఉదయంతో ముగింపు సందర్భంగా ప్రసాద వితరణ ఉంటుందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన ట్రాలీఆటో



ఆటోను బయటకు నెడుతున్న యువకులు

చింతలమానేపల్లి, ఆగస్టు 26: మండలంలో కేతిని-గూడెం ప్రధానరహదారిపై ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్లు బురదమయంగా మారాయి. వీటిపై నుంచే అధికలోడ్ వాహనాలు ప్రయాణించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. ఈ రహదారిపై సోమవారం కొబ్బరిబొండాల లోడ్‌తో మహారాష్ట్రకు వెళ్తున్న ట్రాలీఆటో గుంతలో ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో వాహనాల తనిఖీలో భాగంగా ఎస్సై నరేష్ పోలీసు సిబ్బందితో గూడెం వైపు వెళ్తుండగా ఆటోను గుంతలో నుంచి యువకుల సహాయంతో బయటకు తీయించారు.

సమస్యల వలయంలో పర్సువాడ

- రోడ్డు సౌకర్యం లేక గిరిజనులపాట్లు
- బండరాళ్ల మధ్య నడక
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కెరమెరి, ఆగస్టు 26: మండలంలోని కేలి(బి) గ్రామపంచాయతీ పరిధిలోని పర్సువాడ గ్రామానికి సరైన రోడ్డుసౌకర్యం, మౌలికసదుపాయాలు కరువయ్యాయి. మండలకేంద్రం నుంచి సుమారు 11 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరం కేలి(బి) గ్రామం వరకు తారురోడ్డు సౌకర్యం ఉంది. అసలుసమస్య ఇక్కడే నుంచి మొదలవుతుంది. కేలి(బి)నుంచి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న పర్సువాడ గ్రామస్థులకు రోడ్డుసౌకర్యంలేక రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బండరాళ్ల మధ్య నడక..

కేలి(బి) గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్సువాడకు వెళ్లాలంటే బండరాళ్ల మధ్య నడక సాగించాల్సిందే. మూడు ఎత్తైన గుట్టలు, దారి పొడవునా పెద్దపెద్ద రాళ్లు, రప్పల మధ్య నడక నరకప్రాయంగా ఉంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం ఏర్పడి 45ఏళ్లు దాటింది. 35 కటుంబాలు 155మంది జనాభా నివసిస్తున్న ఈ గ్రామంలో లంబాడ గిరిజన తెగకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామసమీపంలోనే ఆదిమ గిరిజన తెగలకు చెందిన కొన్ని కుటుంబాలు సైతం నివాసం ఉంటున్నాయి. గ్రామంలో నేటివరకు చేతిపంపుకూడా లేదంటే గ్రామంలోని ప్రజల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 45ఏళ్ల క్రితం గ్రామస్థులే నిర్మించుకున్న పురాతన బావి, కొత్తగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ నీళ్లపై ఆధారపడుతున్నారు. 20రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో బావినీటినే తాగుతున్నారు.

రోడ్డు సౌకర్యం లేక అభివృద్ధికి దూరం..

కేలి(బి) గ్రామంనుంచి ఎత్తున గుట్టలవరకు రెవెన్యూ పరిధిలో భాగంకాగా గుట్టలు మొదలు పర్సువాడ గ్రామం వరకు అటవీశాఖ పరిధిలో ఉండడంతో రోడ్డు నిర్మించలేని పరిస్థితి. దీంతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు. గ్రామంలో నేటికీ పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం లేదు. పాఠశాల తాత్కాలికంగా ఏర్పాటుచేసిన షెడ్‌లో కొనసాగుతుండగా, అంగన్‌వాడీ కేంద్రం ఓ ఇంట్లో కొనసాగుతోంది. డ్రెయినేజీ వ్యవస్థలేక మురుగునీరు ఇళ్లమధ్య పారుతోంది. గ్రామంలో కనీసం సీసీ రోడ్లు లేవు. వర్షాలకు గ్రామమంతా బురదమయంగా మారిఅడుగు బయట పెట్టలేని విధంగా ఉంటుంది. గ్రామస్థులకు పక్కా ఇళ్లు లేకపోగా నేటికీ కర్రతో నిర్మించుకున్న ఇళ్లలో నివాసం ఉంటున్నారు. పాలకులు దృష్టిసారించి రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. రోడ్డుసౌకర్యం ఏర్పడితే పర్సువాడ గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

బండరాళ్ల రోడ్డుతో బాలింత కష్టాలు..

బండిపై కూర్చొని.. బండరాళ్ల రోడ్డపై వెళుతూ బాలింతపడ్డ కష్టాలు అంతా ఇంతా కావు. ఈ నెల6న పర్సువాడ గ్రామానికి చెందిన నిండు గర్భిణి రాథోడ్ కల్పనకు పురిటినొప్పులు అధికం కావడంతో బండరాళ్లరోడ్డుపై కాలినడకన కేలి(బి) గ్రామం చేరుకుంది. అక్కడినుంచి కెరమెరి పీహెచ్‌సీకి ఆటోలో వెళ్లింది. అదేరోజు రాత్రి కల్పన మగశిశువుకు జన్మనిచ్చింది. తిరుగు ప్రయాణంలో కేలి(బి) వరకు మళ్లీ ఆటోలో వచ్చిన బాలింత కేలి(బి) నుంచి పర్సువాడ గ్రామానికి కుటుం సభ్యులతో కలిసి ఎడ్లబండిపైనే ప్రయాణించాల్సి వచ్చింది. చుట్టూ ఎత్తైన గుట్టలు బండరాళ్ల దారిగుండా ఎడ్లబండిపై అతికష్టం మీద గ్రామానికి చేరుకుంది. ఒక క్రమంలో గుట్ట ఎక్కే సందర్భంలో ఎడ్లబండి కూడా రాళ్లదారిపై ముందుకు వెళ్లలేకపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పర్సువాడ గ్రామానికి రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు వేడ్కొంటున్నారు.



కోతకు గురైన దారిపై నుంచి నడుచుకుంటూ వస్తున్న గర్భిణీ(ఫైల్)



పర్సువాడ గ్రామం



గ్రామానికి ఉన్న బురద రోడ్డు



ఎడ్లబండిపై బాలింతను తీసుకు వస్తున్న కుటుంబీకులు(ఫైల్)

ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కమలాకర్


సిర్పూర్(టి), ఆగస్టు 26: ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సైబర్‌క్రైంస్‌పై ఆయన అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లింక్‌లు, ఓటీపీలు ఇతర మెసేజ్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేట ప్పుడు ఖచ్చితంగా హెల్మెంట్ ధరించాలని ప్రతి వాహనానికి ఇన్సురెన్స్ ధ్రువ పత్రాలు ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆశాజనకంగా పత్తి పంట

సిర్పూర్(టి), ఆగస్టు 26: మండలంలోని 16గ్రామ పంచాయతీల్లోని 27గ్రామాల పరిధిలో రైతులు 14వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఇరవై రోజులుగా కురుస్తున్న భారీవర్షానికి పత్తిపంట ఆశాజనకంగా సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పత్తి కాతదశలో ఉండగా మరో రెండు నెలల వ్యవధిలో పత్తి పంట చేతికందే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈసారి తెల్లబంగారం ప్రతి రైతుకు ఆశాజనకంగా సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదీ ఏమైనప్పటికీ ఈ సారి వర్షాలతో పత్తి, వరిసాగుకు డోకాలేదని రైతులు పేర్కొంటున్నారు.

డాక్టర్లను భర్తీ చేయాలని ప్రజాసంఘాల రాస్తారోకో

జైనూర్, ఆగస్టు 26: మండల కేంద్రంలోని 30పడకల ఆసుపత్రిలో డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్రవర్కింగ్ ప్రెసి డెంట్ కనక యాదవ్‌రావ్, బీసీ సంఘం జిల్లాకార్యదర్శి ముండే సతీష్‌కుమార్ మాట్లాడుతూ జైనూరు ప్రభుత్వాసుపత్రిలో ఎనిమిది మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారన్నారు. ఏజెన్సీలోని జైనూర్‌తోపాటు సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలనుంచి రోగులు వైద్యంకోసం జైనూర్‌కు వస్తుంటారని అన్నారు. ఆసుపత్రిలో ఒక్కరే డాక్టర్ ఉండడంతో సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. చేసేదిలేక రోగులు ప్రైవేట్‌ఆసుపత్రిని ఆశ్రయించి ఆర్థికంగా నష్టపో తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు వెంటనే స్పందించి జైనూరు ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రంభీంరావ్, చాహకటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కీమానాయక్ తండాలో వైద్యశిబిరం

లింగాపూర్, ఆగస్టు 26: మండలంలోని కిమానాయక్ తండాలో సోమవారం డాక్టర్లు వైద్య శిబిరం నిర్వహించారు. తండా వాసులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ రమేష్ ఏఎన్ఎం సంతోషి పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కబ్జాదారులపై చర్యలేవి?

- ఇంటి నంబరు రద్దు చేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కాగజ్‌నగర్, ఆగస్టు 26: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో కబ్జాదారులు చేసిన పనులకు దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారే తప్పవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కొద్దిరోజుల క్రితం పట్టణానికి కూతవేటు దూరంలో మున్సిపల్ స్థలంలో నిర్మించిన ఇంటికి అధికారులు ఇంటినెంబరు కేటాయించారు. అది తప్పని వెంటనే రద్దుచేయాలని పలుపార్టీల నాయకులు ఫిర్యాదు చేయటంతో ఆ నెంబర్లను రద్దు చేశారు. కానీ ఆక్రమణదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కబ్జా చేశారని స్పష్టంగా రూఢీ అయినప్పటికీ జిల్లా అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారనేది అందు చిక్కని ప్రశ్న.



కాగజ్‌నగర్‌లో కేటాయించిన ఇంటి నెంబరును రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన లేఖ

ఇంటి నంబరుతో సొంతం చేసుకుంటున్నారు..

మున్సిపాల్టీలో ఖాళీ స్థలాలపై కొంతమంది దళారుల కన్నుపడింది. ఈ స్థలాలకు ఇంటి నంబర్లు తీసుకుని దాని ఆధారంగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అయితే అది కబ్జా స్థలమని ఫిర్యాదులు వస్తే రద్దు చేస్తున్నారనే తప్పా ఇంతవరకు ఆక్రమణదారులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎడాపెడా ఇంటి నంబర్లు ఇచ్చే సమయంలో ఎందుకు పరిశీలించటం లేదని ప్రజల ఆరోపణ. కొంతమంది అధికారులు చేసిన తప్పిదాలతో విలువైన ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోందని ఆయా కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దీని వెనకవున్న నాయకులు, అధికారులపై సమగ్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సన్న బియ్యం సామాన్యులకు వరం

- రేషన్ దుకాణాల్లో పంపిణీకి ప్రభుత్వ యోచన
- ఇక రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్



వాంకిడి, ఆగస్టు 26: ధరాఘాతానికి విలవిలలాడుతున్న సామాన్య జనానికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జనవరి నుంచి సన్నబియ్యంతోపాటు రాయితీపై గోధుమలు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో నిరుపేదలకు ఊరట కలగనుంది. నిత్యవసర ధరలు పెరగడంతో సామాన్యులకు బతుకు గడపడం కష్టమవుతోంది.

రెండేళ్ల కిందట మార్కెట్లో కనిష్టంగా రూ.35 నుంచి 40పలికిన సన్నబియ్యం ప్రస్తుతం రూ.60కు చేరడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. చాలామంది చౌక ధరల దుకాణం పంపిణీ చేసే దొడ్డు బియ్యంను వ్యాపారులకు విక్రయించి అధికధరలు వెచ్చించి సన్నబియ్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయం పేదప్రజలకు మేలు చేసేలా ఉంది.



నాణ్యత లేకుంటే ప్రయోజనం సున్నా..

వసతిగృహాల్లో భోజనం నాణ్యత లేదంటూ విమర్శలున్నాయి. వాటిలో కలపాల్సిన ఫోర్టిఫైడ్ (పోషకాలు) సరైన మోతాదులో కలపడంలేదని ఆరోపణ. ఇది పక్కాగా జరగాలి. గత ప్రభుత్వహయాంలో పంపిణీ చేసిన సన్నబియ్యం అనుభవాలు చూస్తే నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించాల్సిన అవసర ముంది. కొన్ని చోట్ల నూక, తౌడు రావడంతో వినియోదారులు ఇబ్బందిపడ్డారు. కొన్ని సార్లు నాణ్యత లేకపోవడంతో లబ్ధిదారులు తినడానికి ఆసక్తి చూపడం లేదు. అయితే జనవరి నుంచి ప్రభుత్వం సన్నబియ్యంతోపాటు గోదుమలు కూడా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కొక్కరికి 6 కిలోలు..

ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు, వసతి గృహాలకు భోజనానికి సన్నబియ్యం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం 5కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం కిలో కలిపి 6కిలోలు ఉచితంగా అందిస్తోంది. దొడ్డు బియ్యంను మధ్యతరగతి ప్రజలు తినడానికి ఇష్టపడటంలేదు. నిరుపేదలు మాత్రమే వినియోగిస్తున్నారు. తిననివారు రేషన్ దందా చేసే వ్యాపారులకు కిలోకు రూ.13నుంచి 15చొప్పున విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యం వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు, లిక్కర్ తయారీకి, కోళ్ల దాణాకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ దందాకు చెక్..

దళారులు, వ్యాపారులు చేసే రేషన్ బియ్యం దందాకు ప్రభుత్వ నిర్ణయంతో చెక్‌పడే అవకాశముంది. ఇకపై ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్న బియ్యంను లబ్ధిదారులు ఎవరూ విక్రయించే పరిస్థితులు ఉండవు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని ప్రాంతాల్లో సన్నబియ్యం పంపిణీ చేయగా లబ్ధిదారులు వాటిని విక్రయించకుండా వండుకొని తిన్నారు. దీంతో దళారుల వ్యాపారానికి కొన్నాళ్లు గండి పడింది. ప్రభుత్వం జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తే అక్రమ బియ్యం రవాణా జరుగకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలోని లబ్ధిదారులు..

జిల్లాలోని 15మండలాల్లో 278రేషన్ షాపులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,40,356రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 1,27,332 ఆహారభద్రత కార్డులు ఉండగా 13,024అంత్యోదయ కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 4.64 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు.

ఏపీ సీఎంను కలిసిన గుళ్లపల్లి ఆనంద్

కాగజ్‌నగర్, ఆగస్టు 26: ఏపీసీఎం చంద్రబాబు నాయుడును సోమవారం హైదరాబాద్‌లో ఉమ్మడిజిల్లా టీడీపీ పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడిజిల్లా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పార్టీ స్థితిగతులపై కూడా వివరించారు.



ఏపీ సీఎం చంద్రబాబుతో గుళ్లపల్లి ఆనంద్

ప్లాంటేషన్‌ను సందర్శించిన ట్రైనీ అటవీఅధికారుల బృందం

సిర్పూర్(టి), ఆగస్టు 26: మండలంలోని ఇటిక్యాలపహాడ్ ప్లాంటేషన్‌ను సోమవారం శిక్షణలో భాగంగా అస్సాం రాష్ట్రానికి చెందిన 40మందిట్రైనీఅటవీరేంజ్ అధికారుల బృందం తెలంగాణ ఫారెస్టుఅకాడమి డిప్యూటీ డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సందర్శించారు. గతంలో నాటిన ప్లాంటేషన్, ఈ సంవత్సరం నాటుతున్న ప్లాంటేషన్ విధానాన్ని వారికి వివరించారు. అలాగే ఫారెస్టు డివిజనల్ అధికారి అప్పలకొండ అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణ, టైగర్ కారిడార్, పులుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. బెల్లంపల్లి రేంజ్ అధికారి పూర్ణచందర్ మొక్కలు నాటే విధానం, ప్లాంటేషన్‌ల సంరక్షణ, అడవుల ఉపయోగం, వన్యప్రాణుల సంరక్షణపైవారికి వివరించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శిఖణ రేంజ్ అధికారులతో 300మొక్కలు నాటించి మొక్కల సంరక్షణ, వాటిచర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీరేంజ్ అధికారి శ్రీధర్‌చారి, ప్రవీణ్ కుమార్, సెక్షన్‌అధికారులు మోహన్‌రావు, ప్రసాద్,బీట్ అధికారులు నరేష్, అరవింద్, శ్రీదేవి,రవీనా, హబీబ్, తబసుం పాల్గొన్నారు.



ట్రైనీ ఎఫ్ఆర్వోలకు మొక్కల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

పశువుల అక్రమరవాణాపై కఠినచర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



ఆవుల వివరాలు అడిగితెలుసుకుంటున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

రెబ్బెన, ఆగస్టు 26: పశువులను అక్రమ రవాణా చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయిహరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని తక్కలపల్లి వద్ద అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ఆవులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాపై జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. 9ఆవులు మృతిచెందటం చాలా బాధాకరమైన విషయమన్నారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, కిరణ్‌కుమార్, అరుణ్ రాజలింగం, వేణుగోపాల్ తదితరులున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



మృతిచెందిన ఆవులు

రెబ్బెన, ఆగస్టు 26: మండలంలోని తక్కళ్లపల్లి బస్టాండు సమీపంలో గల ఎకో బ్రిడ్జి వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్టు రెబ్బెన సీఐ చిట్టిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 7 గంటలకు బ్లూకోట్ కానిస్టేబుల్ ఎకో బ్రిడ్జి వైపు వెళ్తూ.. వ్యాన్‌ను పరిశీలించాడన్నారు. అందులో ఆవులు, ఎద్దులు ఉండ టంతో ఎస్సై చంద్రశేఖర్‌కు సమాచారం అందించాడన్నారు. ఎస్సై సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 24పశువులు, 3ఎద్దులు, 21ఆవులు ఉన్నట్టు తెలిపారు. అందులో 9ఆవులు మృతిచెందినట్టు తెలిపారు. పశువైద్యాధికారి డాక్టర్ సందీప్‌తో పోస్టుమార్టం చేయించామన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి, డ్రైవర్ తమిరసన్, మరొకరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



పట్టుబడిన వ్యాన్

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ టెండర్లు రద్దు చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 26: జిల్లాలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ టెండర్లను రద్దు చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి డిమాండ్ చేశారు. ఇటీవల ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ టెండర్ ప్రక్రియ పూర్తి రహస్యంగా జరుగుతోందన్నారు. అసలుప్రచురణలో లేని దినపత్రికల్లో ప్రకటన చేసి అనేక నిబంధనలు పెట్టి మళ్లీ పాతవారికే ఏజెన్సీ అప్పజెప్పేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చాలా సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలో అవినీతి జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టచుకోవడం లేదన్నారు. నిరుద్యోగుల దగ్గర నుంచి ఒక్కో ఉద్యోగానికి లక్షనుంచి రెండులక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు ఉన్నతాధికారికి ఆర్థికలావాదేవీలు ఉన్నందువల్లనే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

జైనూర్, ఆగస్టు 26: ఆర్థికఇబ్బందులు తాళలేక మండల కేంద్రంలోని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సైసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని విహికర్‌సెక్షన్‌కాలనీకి చెందిన పల్లపు లక్ష్మి(41) ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్నేళ్ల క్రితం మృతురాలి భర్త మృతిచెందాడు. ఆమెనే పిల్లల్ని పోషిస్తోంది. ఈక్రమంలో మూడేళ్లక్రితం పెద్దకూతురు పెళ్లికోసంసుమారు రూ.2లక్షలవరకు అప్పుచేసింది. అప్పు తీర్చేదారిలేక మనోవేదనతో లక్ష్మి ఆదివారం రాత్రిఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు



ప్రమాదాలు లేని సింగరేణియే లక్ష్యంగా పనిచేయాలి



కార్పొరేట్ జీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

మందమర్రి టౌన్, ఆగస్టు 26: ప్రమాదాలు లేని సింగరేణే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. సేఫ్టీ జీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం ఆయన మందమర్రిఏరియాలో అధికారులతో రక్షణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గనులు, డిపార్టుమెంట్లలో రక్షణచర్యలు చేపడుతూ ముందుకు సాగాలన్నారు. అధికారులు పనిస్థలాలను పర్యవేక్షించాలన్నారు. కార్మికులు కూడా ఏమైనా సమస్యలు ఉన్నా, రూఫ్, సైడ్ వాల్స్ కూలే ప్రమాదాలను ముందుగా పసిగడితే అధికారులకు తెలపాలన్నారు. ఈ సందర్భంగా ఏరియా అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఆర్జీ1 జీఎం సేఫ్టీ కేహెచ్‌ఎన్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

గనులను తనిఖీ చేసిన డీడీఎంఎస్

శ్రీరాంపూర్, ఆగస్టు 26: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6,ఎస్ఆర్‌పీ-3 గనులను డీడీఎంఎస్(మెకానికల్) దిలీప్‌కుమార్ సోమవారం సందర్శించారు. రోప్ హైలేజీ సిస్టమ్‌ను తనిఖీ చేశారు. గనులకు చెందిన ప్లాన్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం అండర్‌గ్రౌండ్‌లో దిగి పనిస్థలాలను తనిఖీ చేశారు. ఉద్యోగులకు పలుసూచనలు అందించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, ఏజీఎం (ఈఅండ్‌ఎం) రామనాథం, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, గ్రూపుఏజెంట్ శ్రీధర్, ఆర్కే-6 గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికకాలనీలకు అందని తాగునీరు

మందమర్రి టౌన్, ఆగస్టు 26: మందమర్రి ఏరియాలోని సింగరేణి కార్మికకాలనీలకు తాగునీరు సక్రమంగా రావడం లేదని టీబీజీకేఎస్ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు ఒ. రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొద్దినెలలుగా తాగునీరు సరఫరా లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం ప్లేడేలకు సంబంధించి నెలలో మూడు ప్లేడేలు చేసిన కార్మికులకు నాలుగవ ప్లేడే ఇవ్వకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందన్నారు. యాజమాన్యం ఈ విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు.

క్రీడల నిర్వహణ కమిటీ ఏర్పాటు

శ్రీరాంపూర్, ఆగస్టు 26: సింగరేణి వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ అసోసియేషన్ వార్షికక్రీడలు శ్రీరాంపూర్ ఏరియాలో మంగళవారం నుంచి నిర్వహించనుండగా, నిర్వహణ కమిటీని ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షుడిగా ఎస్‌వోటు జీఎం ఎన్‌సత్యనారాయణ, చీఫ్‌కో-ఆర్డినేటర్‌గా డీజీఎం(పర్సనల్) పిఅరవిందరావు, గౌరవకార్యదర్శిగా పాల్‌సృజన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అసిస్టెంట్‌స్పోర్ట్స్ సూపర్‌వైజర్ సీహెచ్‌అశోక్, కో-ఆర్డినేటర్‌గా ఆర్కే-న్యూటెక్ ఎస్‌డీఎల్‌ఆపరేటర్ ఎస్‌నర్సయ్యను నియమించారు. వివిధ క్రీడాంశాలకు సంబంధించి కెప్టెన్లను ఎంపిక చేశారు.

జయ కృష్ణా.. ముకుందా.. మురారీ..

- జిల్లాలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కాగజ్‌నగర్‌లో కృష్ణుని వేషధారణలో చిన్నారి

ఆసిఫాబాద్ రూరల్/వాంకిడి/దహెగాం/కౌటాల/లింగాపూర్, ఆగస్టు26: జిల్లాకేంద్రంలోని యాదవసంఘం భవనంలో, మండలాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్‌యాదవ్, శరత్‌యాదవ్, వెంకన్న, ప్రసాద్‌గౌడ్, ముషీర్, పెంటు, శ్రీశైలంయాదవ్, ప్రణయ్, సదాశివ్, తిరుపతి, పెంటు, వాంకిడిలో నాయకులు పెంటయ్య, నారాయణ, గొల్లయాదవ్, శంకర్, బ్రహ్మయ్య, లింగాపూర్‌లో జరిగిన వేడుకల్లో గ్రామనాయక్ కిరణ్‌కుమార్, యువకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్/రెబ్బెన: కాగజ్‌నగర్‌పట్టణంలో శ్రీసరస్వతిపాఠశాలలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో ఉట్టి కొట్టారు. అలాగే పట్టణంలోని పలుకూడళ్ల వద్దకూడా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు పురస్కరించుకొని శోభాయాత్ర నిర్వహించారు. రెబ్బెన ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిల్లలతో రాధాకృష్ణుల వేషధారణ వేయించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా కోదండ రామాలయంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దహెగాంలో ఉట్టికొడుతున్న యువకులు



కాగజ్‌నగర్‌లో ఉట్టికొడుతున్న చిన్నారులు



ఆసిఫాబాద్‌లో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు



రెబ్బెనలో..



కౌటాలలో..



కాగజ్‌నగర్ శోభాయాత్రలో యాదవసంఘం నాయకులు